





ఆలయం వద్ద భక్తుల కోలాహలం - సోమవారోత్సవాలను ప్రారంభిస్తున్న సీతాపతి, చంద్రారెడ్డి - నాగులపుట్ట, వేప, రావి వృక్షాలకు పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా సోమవారోత్సవాలు

రామకుప్పం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వార్షిక సోమవారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మూలమూర్తికి పురోహితులు కృష్ణమూర్తి, వాసు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, వెండి కవచ ధారణతో విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం నెమలి వాహనంపై వళ్ళీ, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవర్లకు పురోహితుడు హరినాథ్ విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ పెద్దలు సీతాపతి, చంద్రారెడ్డి ప్రాకారోత్సవంతో సోమవారోత్సవాలను ప్రారంభించారు. ఉదయం ఆరు గంటల నుంచే వేలాదిగా తరలివచ్చిన భక్తులు తొలుత ఆలయ ఈశాన్య దిక్కున గల నాగులపుట్ట వద్ద పూజలు చేసి పాలు, పండ్లు సమర్పించారు. సంతానలేమితో బాధపడుతున్న దంపతులు రావి, వేప వృక్షాలకు పూజలు చేసి కొమ్మలకు జోలెలు కట్టి స్వామివారిని దర్శించుకున్నారు. కళ్ళ, చెవుల రుగ్మతలతో బాధపడుతున్న వారు వెండితో చేసిన కళ్ళు, చెవులు, సర్పదోషం ఉన్నవారు నాగపడిగలను స్వామి వారి హుండీలో వేసి మొక్కుకున్నారు. మొక్కులు నెరవేరిన భక్తులేమో స్వామివారికి ప్రాకారోత్సవాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నాగులమద్దమ్మ, శనీశ్వరస్వామి, వినాయకాలయం, పద్మావతి, వేంకటేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తజనంతో కిటకిటలాడాయి. సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పంబవాయిద్యాల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగింపుగా వచ్చి కుండకావళ్ళు, పూల కావళ్ళు, నెమలి కావళ్ళు, వీపుతేర్లు సమర్పించారు. పలువురు భక్తులు దవడలకు శూలాలు, శరీరాలపై సూదులతో నిమ్మకాయలు గుచ్చుకుని వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. సీఐ మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వెంకటమోహన్, ట్రైనీ ఎస్‌ఐ మధుసూదన్ బందోబస్తు నిర్వహించారు.

40 గ్రామాలకు మహర్దశ

పీఎంఏజీవైకి రెండో విడతలో ఎంపిక

రూ.8 కోట్లు కేటాయించిన కేంద్రం

రూ.12.59 కోట్లతో జరగనున్న అభివృద్ధి పనులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన (పీఎంఏజీవై) ద్వారా జిల్లాలో ఎస్సీ జనాభా అధికంగా వున్న 40 గ్రామాలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.ప్రధానంగా అంతర్గత రహదారులు, కాలువల నిర్మాణాలు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ పనులు, కార్యాలయ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. పీఎంఏజీవైతో పాటు ఆర్థిక సంఘం, ఎంపీ ల్యాడ్స్ ఉపాధి హామీ పథకం నిధులు కలిపితే రూ.60 నుంచి రూ.80 లక్షల వరకు సమకూరుతాయి. పీఎంఏజీవైలో ఇంతకుముందు 50 శాతం ఎస్సీ జనాభా వున్న పల్లెలను ఎంపిక చేయగా, ప్రస్తుతం 40 శాతం ఉన్నవాటికే నిధులు కేటాయించారు.ఈ పథకం కింద ఎంపికైన పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20 లక్షల చొప్పున కేంద్రం రూ.8 కోట్ల మేర కేటాయించింది. వీటితో పనులు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పీఎంఏజీవైకి ఎంపికైన పంచాయతీల్లో ముందుగా ప్రణాళికలు తయారుచేసి గ్రామసభ తీర్మానం పొందాలి. తర్వాత ప్రభుత్వానికి నివేదించి అనుమతి వచ్చాక పనులు చేపట్టాలి. ఈ పథకంలో రూ.20 లక్షల నిధులు కేంద్రప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఈనెల 25లోగా ఆయా వివరాలను పంపాలని ఆదేశాలు రావడంతో సిబ్బంది ఆ పనుల్లో నిమగ్నమయ్యారు.

రెండో విడతలో...

పీఎంఏజీవైకి తొలివిడతలో 18 గ్రామాలను ఎంపిక చేయగా, రెండో విడతలో 11 మండలాల్లోని 40 గ్రామాలను ఎంపికచేశారు. చిత్తూరు మండలంలో అనగల్లు, అనంతాపురం, చింతలగుంట, గువ్వకల్లు, పచ్చనపల్లి, పెరుమాళ్ళకండ్రిగ, బంగారుపాళ్యం మండలంలో జంబువారిపల్లి, నలగాంపల్లి, గంగాధరనెల్లూరు మండలంలో అంబోదరపల్లి, ఆత్మకూరు, మూర్తినాయనిపల్లి, ముక్కళత్తూరు, బొజ్జనాయనిపల్లి, పాతవెంకటాపురం, వీరకనెల్లూరు, వేల్కూరు, గుడిపాల మండలంలో మరకాలకుప్పం, శ్రీరంగంపల్లి, పశుమంద, ఖైదుగానికండ్రిగ, కార్వేటినగరం మండలంలో గోపిశెట్టిపల్లి, ఆర్కేవీబీపేట, నగరి మండలంలో మేలపట్టు, పాలసముద్రం మండలంలో తిరుమలరాజుపురం, శ్రీరంగరాజపురం మండలంలో కొండ్రాజపురం, కటికపల్లి, ముద్దికుప్పం, పాతపాళ్యం, వెంకటాపురం, ఒడ్డుపల్లి, డి.కె. మర్రిపల్లి, ఎస్.ఎస్. రాజపురం, తవణంపల్లె మండలంలో దిగువ తడకర, ఈచనేరి, మత్యం, చిన్నముడుగుపల్లి, వెదురుకుప్పం మండలంలో అగ్గిచేనుపల్లి, దేవరగుడిపల్లి, తిప్పినాయుడుపల్లి, యాదమరి మండలంలో కోణాపల్లి ఎంపిక య్యాయి.

147 పనులకు ప్రతిపాదనలు

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన కింద ఎంపికైన 40 గ్రామాలకు కేంద్రం కేటాయించిన నిధులకు తోడు కన్వర్జెన్సీ నిధులు కలిపి రూ.12.59 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 58 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 89 పనులకు రూ.4.59 కోట్లు కన్వర్జెన్సీ నిధులుగా చూపారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా గజేంద్ర,మీరా



గజేంద్ర - మీరా

పలమనేరు/నగరి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కష్టపడి పనిచేసే వారిని పదవులు వెతుక్కుంటూ వస్తాయని తరచూ పార్టీ అధ్యక్షప్రధాన కార్యదర్శులు చంద్రబాబు, లోకేష్ చెబుతుంటారు. దీనికి మంచి ఉదాహరణగా పలమనేరు నియోజకవర్గంలోని మారు మూల గ్రామానికి చెందిన వి.గజేంద్రను,నగరి మండలం మాంగాడు గ్రామానికి చెందిన మీరాను చెప్పుకోవచ్చు. వి.కోట మండలం కృష్ణాపురం పంచాయితీలోని ఎడగురి గ్రామ నివాసి అయిన వి.గజేంద్రకు టీడీపీ అంటే అభిమానం.రెండేళ్ల క్రితం యువగళం పేరుతో నారాలోకేష్ చేపట్టిన పాదయాత్రలో చివరి వరకు గజేంద్ర పాల్గొన్నాడు. ఈ క్రమంలో భీమవరం సమీపంలోని నిడదవోలులో అప్పటి వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసు పెట్టి గజేంద్రను అరెస్టుచేసింది. 48 రోజుల పాటు జైలు జీవితం అనుభవించి విడుదలైన గజేంద్ర ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం కృషి చేశాడు.ఈ నేపథ్యంలో గజేంద్రను రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరి మండలం మాంగాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు మీరాను రాష్ట్రస్థాయి పదవి వరించింది.మాంసాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆమెను ప్రభుత్వం నియమించింది.నగరి మాజీ ఎంపీపీగా పని చేసిన ఈమె తెలుగు మహిళ అధికారప్రతినిధిగా టీడీపీకి విశేష సేవలందించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో అరెస్టయి ఇబ్బందులెదుర్కొన్నా వెనుదీయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేశారు.

5న మిలాద్ ఉన్ నబీ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని ముస్లింలు ఈనెల ఐదో తేదీన మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా మిలాద్ ఉన్ నబీని జరుపుకోనున్నారు. ముస్లింల కుటుంబాలు తమ పూర్వీకుల ఆత్మశాంతికై ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నగరంలోని పెద్దమసీదు నుంచి ఊరేగింపుగా ప్రవక్త కేశాలను తీసుకొచ్చి అసార్ వీధి మసీదులో భక్తుల దర్శనార్థం ఉంచుతారు.

93.94 శాతం సామాజిక పింఛన్ల పంపిణీ

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ తొలిరోజైన సోమవారం జిల్లావ్యాప్తంగా 93.94 శాతం పూర్తయ్యింది. జిల్లాలో 2,68,770 మందికి 2,52,473 మందికి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. మిగిలిన 16,297 మందికి మంగళవారం అందజేయనున్నారు. పింఛన్ల కోసం రూ.114.79 కోట్లు విడుదలవగా, తొలి రోజున 107.44 కోట్లను లబ్ధిదారులకు అందజేశారు.



పింఛన్ సొమ్ము కార్యదర్శి స్వాహా



పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు

పుంగనూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్మును ఓ పంచాయతీ కార్యదర్శి స్వాహా చేయడంతో పుంగనూరు మండలం బండ్లపల్లెలో సోమవారం పింఛన్లు అందలేదు.చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీ మాదంవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు బండ్లపల్లె గ్రామ పంచాయతీ గ్రేడ్- 5 కార్యదర్శిగా పని చేస్తున్నాడు.152మందికి పింఛన్ అందించేందుకు శనివారం బ్యాంకు నుంచి రూ.6.34లక్షలు డ్రా చేశాడు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, సిరికల్చర్ అసిస్టెంట్‌తో కలసి పింఛన్లను పంపిణీ చేయాల్సిన శ్రీనివాసులు ఉదయం 11గంటలకు కూడా రాలేదు. పింఛనుదారులు పంచాయతీ కార్యాలయం వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. ఆన్‌లైన్‌లో ఒక్క పింఛను కూడా పంపిణీ జరగకపోవడంతో ఎంపీడీవో లీలా మాధవి ఆరా తీశారు. వెంటనే శ్రీనివాసులు స్వగ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వ సొమ్మును ఇవ్వకపోతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అయితే తమకు డబ్బు ఇచ్చే పరిస్థితి లేదని, గతంలో కూడా ఇలా ఎన్నో చేస్తే తాము చెల్లించినట్లు అధికారుల ఎదుట వారు వాపోయారు.దీంతో ఎంపీడీవో వెంటనే చిత్తూరు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవికి సమాచారం ఇవ్వగా కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని మంగళవారం ప్రత్యామ్నాయంగా పింఛన్లు పంపిణీ ఏర్పాట్లు చేస్తామని పీడీ చెప్పారు. అదేవిధంగా కార్యదర్శి శ్రీనివాసులును కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు సమాచారం. కాగా సీఐ సుబ్బరాయుడు కార్యదర్శి శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై పింఛను సొమ్ము స్వాహా చేసినట్లు తెలిసింది.




యూరియా పర్మిట్ల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు - పర్మిట్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఏడీ శివకుమార్‌రాజు

వీడని యూరియా ఇక్కట్లు

బందోబస్తు నడుమ పుంగనూరులో పంపిణీ

పుంగనూరు, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి):రైతులను యూరియా కొరత వేధిస్తూనే వుంది. సోమవారం యూరియా వస్తుందని తెలుసుకున్న పుంగనూరు, చౌడేపల్లె, రామసముద్రం మండలాల రైతులు ఉదయం 6గంటలకే పుంగనూరుకు చేరుకుని వ్యవసాయశాఖ అధికారులు ఎప్పుడు పర్మిట్లు ఇచ్చి పంపిణీ చేస్తారోనని ఎరువుల దుకాణాల వద్ద నిరీక్షించారు.పెద్ద సంఖ్యలో రైతులు చేరుకోవడంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వ్యవసాయశాఖ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐ వెంకటరమణ దుకాణాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.క్యూలైన్లు పెట్టి ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతుకు ఒక బస్తా చొప్పున పర్మిటు ఇచ్చి యూరియా పంపిణీ చేశారు. దీనికి తోడు ప్రతి రైతు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి బయోమెట్రిక్ తీసుకున్న తర్వాతే అనుమతి ఇవ్వడంతో పంపిణీ ఆలస్యంగా సాగింది. ఈ సందర్భంగా పుంగనూరు ఏడీఏ శివకుమార్ రాజు మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్లకు రెండు, మూడు రోజుల్లోపు యూరియాను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతులు యూరియా అధిక వినియోగాన్ని తగ్గించి బయోఫర్టిలైజర్‌లను, నానో డీఏపీని వినియోగించాలని ఆయన సూచించారు.

తొమ్మిది మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావ కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. సోమలలో 10.4, పెనుమూరులో 8.6, శ్రీరంగరాజపురంలో 8.2, కుప్పంలో 5.2, చౌడేపల్లెలో 5, నింద్రలో 4.2, పూతలపట్టులో 2.4, తవణంపల్లెలో 1.8, చిత్తూరు అర్బన్‌లో 1.6 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

బోయకొండ ఆలయ బోర్డు దరఖాస్తుల పరిశీలన

చౌడేపల్లె, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆలయ పాలకమండలి సభ్యుల దరఖాస్తులను పరిశీలించినట్లు ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాలక మండలి సభ్యుల కోసం 115 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో వెరిఫికేషన్‌కు 88 మంది సభ్యులు వచ్చినట్లు తెలిపారు.

స్టేట్ ఓపెన్ చెస్ టోర్నీ విజేత భవన్

రాష్ట్రవ్యాప్తంగా 350 మంది క్రీడాకారుల హాజరు




పోటీలో పాల్గొన్న క్రీడాకారులు - విజేతలకు జ్ఞాపిక, చెక్కు అందజేసిన నిర్వాహకులు

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ అసోసియేషన్, యువన్య బ్రెయిన్ బాక్స్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో చిత్తూరులోని అరణ్య సాయి ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు 26 జిల్లాల నుంచి సుమారు 350 మంది పాల్గొన్నారు. ఓపెన్ కేటగిరీ కావడంతో నాలుగేళ్ల పిల్లాడి నుంచి 50 ఏళ్లు దాటినవారి వరకు హాజరయ్యారు. వివరాలను సోమవారం నిర్వాహకులు వెల్లడించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కొల్లా భవన్ (ఎన్టీఆర్ జిల్లా), జేకే రాజు (ప్రకాశం జిల్లా), హర్షఫ్ సుభాని (తిరుపతి జిల్లా) నిలిచారు. వీరికి రూ.15వేలు, రూ.10వేలు, రూ.7500 అందజేశారు. అలాగే అన్ని విభాగాల్లో గెలుపొందిన, పాల్గొన్న క్రీడాకారులకు ఆంధ్రా చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్‌బీ ప్రసాద్, జిల్లా చైర్మన్ బాబూప్రసాద్ రెడ్డి కలిసి జ్ఞాపిక, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. తిరుపతికి చెందిన చైతన్య కన్‌స్ట్రక్షన్ చైర్మన్ వెంకటేష్, టోర్నమెంట్ డైరెక్టర్ యువన్య, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బాలు సోమనాథ్, సభ్యులు లేఖ్య, డీఎస్ పిళ్లై, దినేష్, సురేఖ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

43 ఏళ్ల వ్యక్తితో నాలుగేళ్ల పిల్లాడు పోటీ

చిత్తూరుకు చెందిన చైతన్య (4), సుధాకర్(43) మధ్య జరిగిన పోటీని పలువురు ఆసక్తిగా చూశారు. చైతన్య 7 పాయింట్లకు 3 పాయింట్లు సాధించగా, సుధాకర్ ఒక పాయింట్ తేడాతో గెలుపొందారు.



చైతన్య, సుధాకర్ మధ్య జరుగుతున్న పోటీ



అమితాష్ ప్రధాన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. నటులు అమితాష్ ప్రధాన్, ప్రియాంక జైన్, శివకుమార్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఉన్నారు.



ప్రియాంక జైన్, శివకుమార్

టీటీడీకి విరాళంగా టాటా ఏస్

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన టాటా మోటార్స్ వరలక్ష్మి ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.5.06 లక్షల విలువైన ఈ టాటా ఏస్ ప్రో వాహనాన్ని టీటీడీకి విరాళంగా అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధులు రామ్‌ప్రసాద్, ప్రదీప్, రితేష్ రమేష్ కొఠారి, మురళీకృష్ణ శ్రీవారి ఆలయం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పేష్కార్ రామకృష్ణకు వాహనం తాళాలను అందజేశారు.



పేష్కార్‌కు వాహనం తాళాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 6 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,310

తలనీలాలు సమర్పించినవారు: 21,866



ముక్కంటి ఆలయంలో సెంట్రలైజ్డ్ సిస్టం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో పాలనను సెంట్రలైజ్డ్ సిస్టంతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. రాహుకేతు సర్పదోష నివారణ పూజల కోసం ఐదురకాల టిక్కెట్లు.. వివిధ ఆర్జిత సేవలు.. దర్శనాల టిక్కెట్లకు కౌంటర్లు కొనసాగిస్తున్నారు. అభిషేకాల కోసం మరో కౌంటర్ ప్రత్యేకంగా ఉంది. ఆలయానికి నాలుగు ప్రవేశ ద్వారాలు ఉండటంతో టిక్కెట్ల కోసం భక్తులకు ఏ కౌంటర్‌కు వెళ్లాలో తికమక పడాల్సిన పరిస్థితి ఉత్పన్నమయ్యేది. ఈ క్రమంలో అన్ని కౌంటర్లను ఒకే చోట ఏర్పాటు చేయడంపై అధికారులతో కలిసి ఇటీవల ఎమ్మెల్యే కసరత్తు చేశారు. సెంట్రలైజ్డ్ సిస్టంలో తొలి అడుగుగా అన్ని టిక్కెట్ కౌంటర్లను రెండో గేటు సమీపంలో ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. దీనికి షెడ్లు, క్యూలైన్లు, కంప్యూటర్లు, పరికరాల ఏర్పాటుకు సోమవారం పనులు ప్రారంభించారు. ఈ పనులను ఎమ్మెల్యే పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయంలో అభివృద్ధి పనులపై సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్

ఏఐ, డ్రోన్ టెక్నాలజీపై విస్తృత పరిశోధనలు

ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ వెల్లడి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఏఐ, డ్రోన్ టెక్నాలజీ మరింత వినియోగించే అంశంపై విస్తృత పరిశోధనలు చేస్తున్నట్టు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ శారద జయలక్ష్మి పేర్కొన్నారు. ఇందు కోసం వివిధ సంస్థలతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. ఐసీఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ల్యాబ్, ఎగ్జామ్ ఎవల్యూషన్ సెంటర్‌లను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వీ వ్యవసాయ కళాశాల అతిథి గృహంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా అధిక దిగుబడి సాధన. సస్యరక్షణ చర్యలపై పరిశోధనల్లో దృష్టి సారించామన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద జీవ నియంత్రణ పద్ధతులతో సస్యరక్షణ ప్రాజెక్టుకు రూ. 5.2 కోట్లు మంజూరయ్యాయన్నారు.. బ్లాక్ సోల్జర్ ఫ్లై ఫామింగ్‌ను ప్రోత్సహించడానికి ఐసీఆర్ నుంచి రూ. 20 లక్షలు మంజూరయ్యాయన్నారు.పుట్ట గొడుగుల పరిశోధనకు రూ.502 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. ఇటీవల ఇక్కడి వ్యవసాయ కాలేజీలో పలు సదుపాయాలు కల్పించామన్నారు. హాస్టల్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేశామన్నారు. కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ఆర్ఏఆర్ఎస్ అధికారి సుమతి పాల్గొన్నారు.



వ్యవసాయ కళాశాలలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వీసీ శారదా జయలక్ష్మి

ఆపరేషన్ 'స్వర్ణ'

హైడ్రా తరహాలో ముందుకుపోతామన్న తుడా చైర్మన్



తిరుపతి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఆక్రమణలపై కొరడా ఝుళిపిస్తున్న హైడ్రా తరహాలో 'ఆపరేషన్ స్వర్ణ' పేరిట స్వర్ణముఖి ప్రక్షాళన, పరిరక్షణకు ముందుకు వెళుతున్నట్లు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి చెప్పారు. తుడా కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. '130 కిలోమీటర్ల పొడవున్న స్వర్ణముఖి నదికి ఇరువైపులా వైసీపీ హయాంలో భారీగా భూములు కబ్జాచేసి అమ్మేశారు. వంకలు, చెరువులను తప్పుడు పత్రాలతో దోచుకున్నారు. ఈ క్రమంలో నదికి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలు, ఆక్రమణలను తొలగించడానికి హైడ్రా తరహాలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నాం. స్వర్ణముఖి బఫర్‌జోన్లలో స్థలాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం' అని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో రూ.40 కోట్ల తుడా నిధులతో తుమ్మలగుంటలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ కట్టారని, ఆ నిధులు పూర్తిగా వ్యర్థమైనట్లు తెలిపారు. తుడాలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ పూర్తయి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. మద్యం స్కాంలో తుడా వాహనాలు వినియోగించిన వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. 'తుడా నిధులు రూ.270 కోట్లను ఎంపీడీవో ఖాతాలకు మళ్లించి దోచుకున్నారు. తుడాలో జిరాక్స్ కాపీల నుంచి విమాన టిక్కెట్లు, వాహనాలు అంతా కుంభకోణమే. తుడాలో ఇప్పుడు పైసా కూడా లేదు. తుడా భూములను వినియోగించుకొని నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నాం' అని వివరించారు. తాను తుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వంద రోజుల్లో ఎన్నో సంస్కరణలు చేపట్టామన్నారు. అస్తవ్యస్త ప్లానింగ్‌తో గత ప్రభుత్వం ప్రారంభించిన తుడా టవర్స్‌ను గాడిలో పెట్టి వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టామన్నారు. సూరప్పకశంలోని తుడా ప్లాట్ల రేట్లు తగ్గించి అమ్మకానికి వేలం నిర్వహిస్తున్నామన్నారు.

తిరుమలలో మొదలైన విద్యుత్ అలంకరణ పనులు



గోపురానికి విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా విద్యుత్ అలంకరణ ఏర్పాట్లనూ టీటీడీ ప్రారంభించింది. ఇప్పటికే శ్రీవారి ఆలయ గోపురానికి సున్నం పనులు పూర్తయ్యాయి. సోమవారం నుంచి విద్యుత్ దీపాల అమరిక పనులను మొదలుపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కేంద్ర శాసన శాఖ అదనపు కార్యదర్శిగా తిరుపతివాసి



డాక్టర్ కొండారి విజయకుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర శాసన శాఖ అదనపు కార్యదర్శిగా తిరుపతికి చెందిన డాక్టర్ కొండారి విజయకుమార్ నియమితులయ్యారు. 2001లో యూపీఎస్సీ ద్వారా ఇండియన్ లీగల్ సర్వీసులో సహాయ శాసన సలహాదారుగా ఆయన ఎంపికయ్యారు. ఈ క్రమంలో వివిధ హోదాల్లో పని చేశారు. తాజాగా పదోన్నతిపై కేంద్ర శాసన శాఖ అదనపు కార్యదర్శిగా నియమితులయ్యారు. వివిధ చట్టాల రూపకల్పన, రద్దు, సవరణ విషయాల్లో విజయకుమార్ కీలక పాత్ర పోషించారు. ఎస్వీయూనివర్సిటీ లా విభాగంలోనే మాస్టర్ ఆఫ్ లా చదివిన ఈయన ఏయూ నుంచీ పీహెచ్‌డీ పూర్తి చేశారు.

రేషన్ డీలర్లకు కొత్త ఈ-పోస్ యంత్రాలు

- 15 నుంచి అందుబాటులోకి..

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇప్పటికే స్మార్టు కార్డులు పంపిణీ చేస్తుండగా.. డీలర్లకు ఈనెల 15వ తేది నుంచి అత్యాధునిక ఈ-పోస్ యంత్రాలను అందజేయనుంది. కాగా, 2015లో డీలర్లకు అందచేసిన ఈ-పోస్ మిషన్లు సక్రమంగా పనిచేయడం లేదు. నెట్‌వర్కు సిగ్నల్ లేని మారుమూల గ్రామాలు, శివారు ప్రాంతాల్లో సరుకుల పంపిణీ కష్టతరంగా మారింది. ఫలితంగా పంపిణీలో తీవ్ర జాప్యం తలెత్తి కార్డుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ తరహా సమస్యలకు చెక్ పెట్టడంతో పాటు ఎలాంటి లోపాలకు తావులేని విధంగా సరికొత్తగా ఈ-పోస్ మిషన్లు ఇవ్వనున్నారు. స్మార్ట్ రేషన్ కార్డులోని క్యూఆర్ కోడ్‌ను వీటితో స్కాన్ చేస్తే ఆ కార్డుదారుల వివరాలు ఈపోస్‌లో నమోదవుతాయి. ఆ ప్రకారం ఏయే సరుకులు.. ఎన్ని కిలోలు ఇవ్వాలనే వివరాలు నమోదవుతాయి. ఇక, కార్డుదారులకు వేలిముద్ర పడకుంటే కంటి పాపను స్కాన్ చేసేలా దీనిని రూపొందించారు. సిమ్, వైఫై, హాట్‌స్పాట్, బ్లూటూత్, టచ్ స్క్రీన్ వంటి సదుపాయాలతో ఆండ్రాయిడ్ సాంకేతికతతో ఇది పనిచేస్తుంది. తద్వారా వ్యవస్థలో పర్యవేక్షణ, నిఘా కట్టుదిట్టంగా ఉంటుందని డీఎస్‌వో శేషాచలం రాజు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. కార్డుదారులు తీసుకునే బియ్యం సహా సరుకుల వివరాలు, ధర తెలుపుతూ రశీదు జారీ చేస్తారన్నారు.



'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలుశిక్ష

రూ.ఆరు లక్షలు జరిమానా

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ సోమవారం రాష్ట్ర ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన అన్బు 2016లో జిల్లా పరిధిలోని పెరుమాళ్లపల్లి బీట్ టీఎన్ పాళ్యం సెక్షన్‌లో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి కేసు దర్యాప్తు జరుగుతోంది. తాజాగా ప్రత్యేక కోర్టుకు బదిలీ కావడంతో విచారణ చేసిన న్యాయమూర్తి సాక్ష్యాధారాలతో రుజువు కావడంతో అన్బుకు ఈ మేరకు శిక్ష విధించారు.

చర్లపల్లి-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నవంబరు వరకు పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి-తిరుపతి మధ్య ఈనెల 9వ తేదీ నుంచి నూతన మార్గంలో ప్రత్యేక రైళ్లను నవంబరు 26వ తేదీ వరకు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు (07013-07014) చర్లపల్లిలో ప్రతి మంగళవారం, తిరుపతిలో ప్రతి బుధవారమూ బయలుదేరి రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. చర్లపల్లి నుంచి బయలుదేరి నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, వినుకొండ, దొనకొండ, గిద్దలూరు, నంద్యాల, కోయిలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కడప, కోడూరు, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుకుంటాయని వెల్లడించారు.

వినాయక నిమజ్జనానికి దారివ్వలేదని

దుర్గసముద్రంలో ఇరువర్గాల దాడి

ఉప సర్పంచి సహా ఆరుగురికి గాయాలు



వివాదంపై గ్రామస్తులతో చర్చిస్తున్న సీఐ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల నేపథ్యంలో జరిగిన దాడిలో గ్రామ ఉపసర్పంచ్‌తో సహా ఆరుగురు గాయపడ్డారు. సీఐ చిన్న గోవింద కథనం మేరకు తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో ఐదు రోజుల పాటు చవితి వేడుకలు జరిగాయి. గ్రామంలో నిమజ్జన దారి విషయమై శనివారం గ్రామ ఉపసర్పంచ్ చిరంజీవి వర్గీయులు, మరో వర్గం మధ్య వాగ్వాదం జరిగింది. ఇది తీవ్రరూపం దాల్చింది. చిరంజీవి, అతని సోదరులు విజయ్, మహేష్, హరీష్, రాజకుమార్, రాజమోహన్‌లపై మరో వర్గం దాడి చేసింది. పెద్ద మనుషుల సమక్షంలో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చారు. అయినా వీరి వివాదం చల్లారలేదు. సోమవారం మధ్యాహ్నం ఉప సర్పంచ్‌తో పాటు అతని తమ్ముళ్లపై బలిజ హరీష్, అతని సోదరులు, మరికొందరితో కలిసి దాడి చేశారు. దాడిలో చిరంజీవితో పాటు అతని సోదరులు గాయపడ్డారు. గాయపడిన ఆరుగురినీ రుయాకు తరలించారు. నిందితులు పరారీలో ఉన్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తుగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ప్రసాద్‌తో పాటు సీఐ సందర్శించారు. ఇరువర్గాలతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

నేడు ఎస్వీయూ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం 71వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు యూనివర్సిటీలోని పలువురు ప్రముఖుల విగ్రహాలకు ఉన్నతాధికారులు పుష్పాంజలి ఘటిస్తారు. సాయంత్రం 5 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకోసం వర్సిటీ ముస్తాబైంది.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శెట్టిపల్లి భూములను పోరాడి సాధించుకుంటాం

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి భూములను సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. వి.నాగరాజు(సీపీఎం), సి.పెంచలయ్య(సీపీఐ), ఆర్.హరికృష్ణ(సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి), భూమన అభినయరెడ్డి(వైసీపీ), పి.అంజయ్య(ఆర్పీఐ) మాట్లాడుతూ 2019లో అప్పటి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ రూపంలో రైతుల నుంచి 70, పట్టాదారుల నుంచి 50 శాతం భూములను తీసుకొందన్నారు. వెంటనే 173జీవో విడుదల చేసి, ప్లాట్లు వేసి బాధితులకు కేటాయించకుండా ఎన్నికల సాకు చూసి మోసం చేసిందన్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వం ప్రొసీడింగ్స్ జారీ చేసినా ప్లాట్లు కేటాయించలేదన్నారు. 15 ఏళ్లుగా ఈ సమస్యపై పోరాటం చేస్తున్నా నాయకులు కాలయాపన చేయడం దుర్మార్గమన్నారు. ఈ క్రమంలో పోరాటాలను ఉధృతం చేయాలని నిర్ణయించారు.

పోరాట కార్యక్రమాల వివరాలు ఇలా..

- రెండో తేదీ కలెక్టర్‌కు సామూహిక వినతి పత్రం ఇవ్వడం
- నాలుగో తేదీ కేబినెట్ మీటింగ్‌లో శెట్టిపల్లి భూ సమస్యపై చర్చ జరగాలి.. లేనిపక్షంలో ఆరో తేదీ అఖిల పక్ష నాయకుల కరపత్రాల పంపిణీ
- తుడా కార్యాలయం వద్ద 8 నుంచి 14వ తేదీ వరకు నిరసన దీక్షలు
- 15, 16 తేదీల్లో 48 గంటల పాటు నిరవధిక నిరాహార దీక్షలు
- అప్పటికీ సమస్య పరిష్కారం కానిపక్షంలో భూముల్లోకి వెళ్లాలని నిర్ణయించారు.

తిరిగి తిరిగి అలసిపోయా..

- నా సమస్యపై అధికారులు పట్టించుకోలేదు
- గన్నేరుపప్పు తిని పీజీఆర్ఎస్‌కు వచ్చిన మహిళ
- తిరుపతి కలెక్టరేట్‌లో కలకలం.. ఆస్పత్రికి తరలింపు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'నన్ను కులాంతర వివాహం చేసుకున్న శరత్‌కుమార్.. ఇప్పుడు రెండో పెళ్లికి సిద్ధమై నిశ్చితార్థం చేసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం స్పందించలేదు. కలెక్టరేట్ చుట్టూ నాలుగు పర్యాయాలు తిరిగినా న్యాయం జరగలేదు' అంటూ ఇందు అనే మహిళ గన్నేరుపప్పు (విషపు కాయలు) తిని తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు వచ్చారు. జేసీ శుభంబన్సల్‌కు వినతిపత్రం ఇచ్చిన ఆమె.. అక్కడే అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో ఉలిక్కిపడ్డ అధికారులు ప్రథమ చికిత్స కేంద్రంలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి సమాచారమిచ్చారు. అనంతరం డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ తన వాహనంలో ఆమెను రుయాస్పత్రికి తరలించారు. ఈమెది తిరుపతి నగరంలోని యాదవకాలనీ. 'నాలుగేళ్ల కిందట శరత్‌కుమార్‌రెడ్డితో ఓటేరు సాయిబాబా ఆలయంలో ప్రేమ వివాహమైంది. అతడి కుటుంబ సభ్యులకు మా పెళ్లి ఇష్టంలేదు. నిత్యం నన్ను తక్కువ జాతి కులమని వేధించేవారు. ఓ మెడికల్‌షాప్‌లో పనిచేసే నా భర్త రూ.10 లక్షలు కట్నం తెస్తేనే రానిస్తామన్నాడు. మే నెల 2న నన్ను వదిలి వెళ్లిపోయాడు. నన్ను దళితురాలినంటూ వేధించడంపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఇప్పుడు రెడ్డి కులానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి నిశ్చితార్థం చేసుకున్నాడు. నేను అడిగితే వాళ్లు బెదిరిస్తున్నారు. నా భర్తను నాతో పంపేలా చేసి, నన్ను ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి' అని అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద తిరుపతి ఈస్ట్ పోలీసులు రెండు నెలల కిందటే కేసు నమోదు చేసున్నారు.



అధికారులకు ఫిర్యాదు చేశాక అపస్మారకస్థితికి చేరుకున్న ఇందు

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

టీటీడీ ఉద్యోగుల నిరసన

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్, సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గోల్కొండ వెంకటేశం, మల్లారపు నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు టీటీడీ పరిపాలనా భవనం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకుని ఉద్యోగులు వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుణశేఖర్, పద్మనాభం, రవికుమార్, ఆవుల నరేష్, కిరణ్‌కుమార్, దయాకర్, వేణుగోపాల్, బాలాజీ, కృష్ణమూర్తి, ఆదిలక్ష్మి, ఇందిరా, ప్రతిభా భారతి, శకుంతల, గౌరీ తదితరులు పాల్గొన్నారు.



ఏడీ భవనం ముందు నిరసన తెలుపుతున్న టీటీడీ ఉద్యోగులు

రుయాస్పత్రి పరిపాలనా భవనం వద్ద..

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలంటూ రుయాస్పత్రిలోని ఏడీ భవనం ముందు సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మోసపూరిత హామీతో మోసం చేయగా, ప్రస్తుత ప్రభుత్వమూ అదే బాటలో పయనిస్తోందని ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి సుబ్బలక్ష్మి అన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మహిళా ఉద్యోగ నేతలు భువనేశ్వరి, సుభాషిణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల స్థలాల పరిశీలన

తిరుపతి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి) : టీడీఆర్ బాండ్లు మంజూరు చేయనున్న స్థలాలను క్షేత్రస్థాయిలో సోమవారం సాయంత్రం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలను కోల్పోయిన సుమారు ఎనిమిది మంది స్థలాలకు సంబంధించిన పత్రాలతో పాటు స్థలాలను పరిశీలించారు. లీలా మహల్ కూడలి, జబ్బార్ లే ఔట్, ఉపాధ్యాయనగర్, చింతలచేను వద్ద గల వంద అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు, సత్యనారాయణపురం స్థలాలను పరిశీలించారు. అలాగే రెండు భవనాల నిర్మాణ అనుమతులను, ప్లాన్‌ను పరిశీలించారు. కమిషనర్ వెంట డీసీపీ ఖాన్ ఉన్నారు.

జ్ఞాన సముపార్జనకు సదస్సులు దోహదం



వైద్య అధ్యాపకులకు జ్ఞాపికలను అందజేస్తున్న రాధ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు జ్ఞానాన్ని సమృద్ధి చేసుకునేందుకు వర్క్‌షాప్‌లు ఉపయోగపడతాయని రుయా సూపరింటెండెంట్ రాధ అన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో సోమవారం ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన గుడ్ క్లినికల్ ప్రాక్టీస్(జీసీపీ) వర్క్‌షాప్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాధ మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మార్గదర్శకత్వంలో వర్క్‌షాప్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఎంబీబీఎస్, పీజీ విద్యార్థులతోపాటు వైద్యులకూ ఇది ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ అబ్జర్వర్‌గా నియమితులైన రుయా రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ భారతిని ఈ సందర్భంగా సన్మానించారు. ఫార్మకాలజీ వైద్య అధ్యాపకులకు, పరిశోధకులకు జ్ఞాపికలను అందజేశారు. జీసీపీ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ రవిప్రభు, ఆర్గనైజింగ్ ఉప కార్యదర్శి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత.. సంక్షేమ విధాత చంద్రబాబు!



కుప్పంలో కేక్ కట్ చేసి వినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

కుప్పం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రానికి, తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్‌కు సైతం అభివృద్ధి ప్రదాత, సంక్షేమ విధాతగా నిలిచింది ముఖ్యమంత్రి చంద్రబాబేనని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించి 30 ఏళ్లు పూర్తయిన సంర్భాన్ని పురస్కరించుకుని కుప్పం టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ శ్రేణులు సంబరాలు జరిపాయి. భారీ కేక్ కట్ చేసి అధినేతకు శుభాకాంక్షలు తెలిపాయి.ఈ సందర్భంగా పీఎస్ఎం మాట్లాడుతూ పార్టీ, రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పుడు 1995 లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు అప్రతిహతంగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేశారన్నారు.టీడీపీ కుప్పం మున్సిపల్, కుప్పం మండల అధ్యక్షులు రాజ్ కుమార్, ప్రేమ్‌కుమార్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, కుప్పం వ్యవసాయ మార్కెట్టు కమిటీ చైర్మన్ వీజీ.ప్రతాప్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం తదితరులు మాట్లాడుతూ ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని విజయపథంలో పయనిస్తున్నదంటే అందుకు అధినేత చంద్రబాబే కారణమని పేర్కొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, అప్పు ముఖేశ్, కాణిపాకం వెంకటేశ్, సర్దార్ బాషా, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్ధి బాబుకు రెండు కళ్లు

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన సాగించారు కాబట్టే ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజయవంతమైన సీఎంగా నిలిచారని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి 30ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలమనేరులో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మూడు దశాబ్దాల కాలంలో నాలుగుసార్లు సీఎంగా 30కి పైగా కీలకమైన పథకాలు, కార్యక్రమాలతో ఎన్నో సంస్కరణలు చంద్రబాబు తీసుకొచ్చారన్నారు.రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రరాష్ట్ర అభివృద్ధికి నిరంతరం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.సుదీర్ఘకాలం ఆయనతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు అమరనాథరెడ్డి చెప్పుకొచ్చారు.

30 ఏళ్లలో 30 కీలక పథకాలు

● ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి,సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి):చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు కీలకమైన 30 పథకాలను ప్రవేశపెట్టారని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ మూడు దశాబ్దాల కాలంలో నాలుగు సార్లు బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రజల వద్దకు పాలన,జన్మభూమి, క్లీన్ అండ్‌గ్రీన్, దీపం,ఆదరణ లాంటి వినూత్న పథకాలు 30దాకా ప్రవేశపెట్టి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.డ్వాక్రాసంఘాలను బలోపేతం చేయడం ద్వారా మహిళల మనసులో శాశ్వతమైన చోటు సంపాదించుకున్నారన్నారు.

శాంతి, ఐక్యత కోసమే మోటర్ సైకిల్ యాత్ర

● సాయుధ దళాల కన్వీనర్ రాహుల్ పాటిల్



రాహుల్ పాటిల్‌కు బుద్ధ ప్రతిమను అందజేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శాంతి, ఐక్యత, సోదరభావాన్ని ముందుకు తీసుకెళ్లడానికే ట్రై నేషన్ ట్రై సర్వీసెస్ లార్డ్ బుద్ధ మోటర్ సైకిల్ యాత్రను ప్రారంభించడం జరిగిందని సాయుధ దళాల కన్వీనర్ రాహుల్ పాటిల్ తెలిపారు. వీరి యాత్ర చిత్తూరులోని బ్యాన్స్ హోటల్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా సోమవారం జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ఘన వీడ్కోలు పలికారు. పాటిల్ మాట్లాడుతూ.. నేపాల్ నుంచి యాత్ర ప్రారంభమైందని, మనదేశంలో ఇప్పటివరకు ఏడు రాష్ట్రాల్లో యాత్రను పూర్తి చేశామన్నారు. ఇప్పుడు కర్నాటకకు వెళ్తున్నామని, అక్కడ పూర్తయ్యాక శ్రీలంకకు వెళ్తున్నట్లు వివరించారు. ఇక్కడ ఆతిథ్యం అందించిన జిల్లా పర్యాటక శాఖకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీ రాజశేఖర్ రాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి గౌరి, ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు నుంచి తమిళనాడుకు ఇసుక అక్రమ రవాణా

● గంగాధరనెల్లూరు వద్ద రెండు టిప్పర్లను పట్టుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నుంచి తమిళనాడుకు ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను గంగాధరనెల్లూరులో పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్ఐ మురళీ ప్రసాద్ తెలిపిన మేరకు.. నెల్లూరు జిల్లా నుంచి రెండు టిప్పర్లలో ఇసుకను లోడ్ చేసుకుని శ్రీకాళహస్తి, పుత్తూరు, కార్వేటినగరం మీదుగా తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్గమధ్యంలోని గంగాధరనెల్లూరు మండలం ఠాణా చెక్‌పోస్ట్ కూడలిలో టిప్పర్లను సోమవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. రెండు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ల యాజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నారాయణస్వామికి జైలుయోగం ఖాయం

● ఎమ్మెల్యే థామస్



సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే థామస్


వెదురుకుప్పం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సిట్ ఇంటికొచ్చి దర్యాప్తు చేపట్టినా తాను మంచోడినే అంటున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తొందరలో లిక్కర్ స్కామ్ కేసులో జైలుకెళ్తాడని విప్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ జోస్యం చెప్పారు.వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీ ధర్మాచెరువులో సోమవారం జరిగిన సమావేశంలో థామస్ మాట్లాడుతూ నారాయణస్వామికి ఎప్పుడో మతిభ్రమించిందని, వైసీపీ పాలనలోనే తమ సీఎం జగన్‌ని ప్రజలు తరిమితరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని చెప్పారంటే ఆయన మానసిక పరిస్థితి ఏంటో తెలుసుకోవచ్చన్నారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.ఏఎంసీ చైర్మన్ కృష్ణమనాయుడు,డైరెక్టరు రావిళ్ల దేవరాజులునాయుడు, పీఏసీఎస్ చైర్మన్లు బోడిరెడ్డి సుధాకరరెడ్డి,నిరంజన్‌రెడ్డి, డైరెక్టర్లు మనోహర నాయుడు, బీఎం రవి,టీడీపీ నేతలు పి.మోహన్‌మురళి, కె.చెంగల్రాయ యాదవ్, గంధమనేని జయశంకర్‌నాయుడు, స్వామిదాస్, సాతాల గుణశేఖర్ యాదవ్, ముడిపల్లి బాలు, మోహన్‌యాదవ్, యుగంధర్, రవి, మద్దేరి భాస్కర్‌రెడ్డి, చంద్రబాబురెడ్డి, మునికృష్ణారెడ్డి, మరకాలకుప్పం సుధాకర్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, జనసేన నేతలు పురుషోత్తం ,శ్రీనివాసులు, యతీశ్వర్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.





చిలుక వాహన సేవ, రథంపై కలశ ప్రతిష్ఠ, పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మురళీమోహన్ తదితరులు

వృషభ వాహనంపై వరసిద్ధుడు



వృషభ వాహన సేవలో పాల్గొన్న భక్తజనం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం చిలుక వాహనంపై వినాయకుడు దర్శనమిచ్చారు. కాణిపాకానికి చెందిన ఆర్యవైశ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే రాత్రి నిర్వహించిన వృషభ వాహన సేవకు కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరు ప్రాంతాలకు చెందిన శాలివాహన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు.రాత్రి వారంతా ఉభయ వరస తీసుకురావడంతో కల్యాణ వేదికపై ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. వృషభ వాహనాన్ని శోభాయమానంగా అలంకరించి సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను వాహనంపై ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు.

ఘనంగా రథ కలశ పూజ

బుధవారం నిర్వహించనున్న రథోత్సవానికి సోమవారం రథ కలశ పూజను నిర్వహించారు. ఉదయం యాగశాల వద్ద విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, రథ కలశ అభిషేకం, రథ సారధి పూజ, సంప్రోక్షణ నిర్వహించాక రథ కలశాన్ని, రథసారథి, స్వామివారి గొడుగును పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం రథ శిఖరంపై కలశాన్ని ప్రతిష్ఠించారు. కాగా బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం శ్రీకాళహస్తీశ్వర ఆలయం తరపున స్వామివారికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి,ఈవో బాపిరెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు.ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో పెంచల కిషోర్, ఏఈవోలు రవీంద్ర బాబు,ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు,చిట్టిబాబు పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గజ వాహన సేవను నిర్వహించనున్నారు.

రెవెన్యూ సమస్యలే ఎక్కువ..!

● కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్‌ఎస్'కు వచ్చిన అర్జీలు 297



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం జరిగింది. వచ్చిన అర్జీల్లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయి. మొత్తం 297 అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూ శాఖకే 211 అర్జీలు ఉన్నాయి. డీఆర్‌డీఏకు 16, పోలీసుశాఖకు 16, పంచాయతీరాజ్‌కు 5, విద్యుత్‌శాఖకు 5, ఎస్ఎస్‌కు 5, విద్యాశాఖకు 3, డ్వామాకు 3, సైనిక్ వెల్ఫేర్‌కు 3, ఐసీడీఎస్‌కు 2, పశుసంవర్ధకశాఖకు 2, మిగిలినశాఖలైన గ్రామీణ నీటిపారుదల, ఎంపీడీవోలు, గృహ నిర్మాణశాఖ, ఇరిగేషన్, నేషనల్ హైవే శాఖలకు కలిపి 26 అర్జీలు అందాయి. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్‌తోపాటు డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, కుసుమకుమారి, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ స్వీకరించారు. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని సమస్యలిలా..

మరోసారి భూసర్వే చేయండి

రెవెన్యూ అధికారులకు తన భూమిని మరోసారి సర్వే చేసి హద్దులు, పట్టాదార్ పాసుపుస్తకాన్ని మంజూరు చేయాలని శాంతిపురం మండలం రెడ్లపల్లెకు చెందిన సరోజమ్మ కోరారు. సర్వే నెంబరు 7-3లో 0.78 ఎకరాల భూమికి సంబంధించి పట్టాదార్ పాసుపుస్తకం ఉందన్నారు. రీసర్వేలో తన భూమి కంటే కొంత అదనంగా చూపారని తెలిపారు. ఎల్‌పీఎం మ్యాపులో మాత్రం మరొక పట్టాదారుడికి చూపించారన్నారు. దాంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయని, రెవెన్యూ అధికారులు మరోసారి సర్వేచేసి సమస్య పరిష్కరించాలని కోరారు.

భూమిని ఆక్రమించారు

కోర్టులో కేసు నడుస్తున్న భూమిని గ్రామంలో కొందరు ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నారని పెనుమూరు మండలం కలిగిరికి చెందిన సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశాడు. సర్వే నెంబరు 10-1లోని భూమిపై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. ఈలోపు భూమిని ఆక్రమించుకున్న వారిని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు వచ్చేవరకు ఈ భూమి దురాక్రమణ కాకుండా చూడాలని కోరారు.

శ్మశానానికి వెళ్లే దారిలో ముళ్లకంపలు తొలగించాలి

శ్మశానానికి వెళ్లేదారిలో ఉన్న ముళ్లకంపలను తొలగించాలని చిత్తూరు మండలం పంత్రాపల్లె గ్రామస్తులు కోరారు. అలాగే దారంతా గుంతలమయంగా మారిందని, ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు.

చనిపోతున్న మూగజీవాలు

మూగ జీవాలకు వచ్చే వ్యాధులకు పశు వైద్య డాక్టర్ సరిగ్గా వైద్యం చేయడం లేదని పెనుమూరు మండలం గంగుపల్లె వాసులు ఫిర్యాదు చేశారు. ఆవులు, మేకలకు వ్యాధులొచ్చినప్పుడు గంగుపల్లె సచివాలయ వెటర్నరీ సిబ్బంది స్పందించడం లేదన్నారు. దీనివల్ల చాలా మూగ జీవాలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసులకు 32 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో బాధితుల నుంచి ఎస్పీ మణికంఠ వినతిపత్రాలను స్వీకరించారు. విచారించి న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. మొత్తం 32 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. భూ తగాదాలపై 11, కుటుంబ తగాదాలపై 8, డబ్బు తగాదాలపై 5, చిన్న చిన్న గొడవలపై 3, ఆస్తి తగాదాలపై 2, చీటింగ్‌పై, సైబర్ క్రైమ్‌పై ఒక్కొక్కటి చొప్పున అర్జీలున్నాయి.

పింఛను మంజూరు చేయండి

వందశాతం వికలాంగత్వంతో ఉన్న తన కుమారుడికి రూ.15వేల పింఛన్ మంజూరు చేయాలని చిత్తూరు మండలం దిగువమాసాపల్లెకు చెందిన ఓ తల్లి కోరారు. తన కుమారుడు శివకుమార్ నడవలేడని, కూర్చోలేడని, మాట్లాడలేడని తెలిపారు. డీఎంహెచ్‌వో అధికారులు వినికిడి పరీక్ష చేయడానికి నిరాకరిస్తున్నారని చెప్పారు. సమస్యను పరిష్కరించాలని విన్నవించారు.

పంటలపై కొనసాగుతున్న గజ దాడులు



కల్లూరు సమీపంలో మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. కల్లూరు పంచాయతీలో ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు దాడితో మామిడిచెట్లు ధ్వంసమయ్యాయి. ముందుగా పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయలుదేరిన 8 ఏనుగుల గుంపు ఘాట్ రోడ్డు సమీపంలోని రిలయన్స్ టవర్ వద్దకు చేరుకున్నాయి. పదిపుట్లబైలులోని రైతు సిద్ధరాజులు మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కల్లూరుకి సమీపంలోని ఎద్దులవారిపల్లి వద్దకు చేరాయి. కల్లూరులోని రైతులు ఖాదర్‌బాషా, జాకీర్, శ్రీరాములుకు చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. పలువురు రైతుల డ్రిప్ పరికరాలను విరిచేశాయి. అక్కడి నుంచి తిరుగుముఖం పట్టిన ఏనుగులు వచ్చిన దారిలోనే అడవిలోకి చేరుకున్నాయి. కొద్దిరోజులుగా పంటలను ధ్వంసం చేస్తున్న 16 ఏనుగుల గుంపు ఆదివారం రాత్రి మూడు గ్రూపులుగా విడిపోయాయి. సదుం మండలం చిట్లగుట్ట వైపు 3 ఏనుగులు, పాకాల మండలం పుల్లావాండ్లపల్లి వైపు 5 ఏనుగులు, పులిచెర్ల మండలం కల్లూరు వైపు 8 ఏనుగులు చేరుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పంటలపై ఏనుగుల దాడుల నివారణకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐకేఎస్ జాబితాలో సంస్కృత, వేద వర్సిటీలకు స్థానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రెండు విశ్వవిద్యాలయాలకు ఇండియన్ నాలెడ్జ్ సిస్టం (ఐకేఎస్) గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఇందుకు సంబంధించిన జాబితాను సోమవారం విడుదల చేసింది. జాబితాలో తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉన్నాయి. ఈ గుర్తింపుతో రెండు వర్సిటీల్లో ప్రత్యేక పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఇందుకు ఆర్థిక సహకారాన్ని ఐకేఎస్ అందించంది. తద్వారా భవిష్యత్తులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గుర్తింపు రావడానికి అవకాశం ఏర్పడింది. తాజా గుర్తింపుపై సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, ఎస్వీ వేద వర్సిటీ వీసీ రాణిసదాశివమూర్తి హర్షం వ్యక్తం చేశారు.



ఆత్మకూరు పంచాయతీ దేవళంమిట్ట పొలాల్లో ఆహారం కోసం బాతుల వేట

తమిళనాడు బాతులొచ్చాయ్!

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మేతకోసం తమిళనాడు నుంచి గంగాధరనెల్లూరు మండలానికి వచ్చిన బాతులు పిల్లలను ఆకర్షించాయి.గుడియాత్తం తాలుకాకు చెందిన ఓ కుటుంబం సుమారు వెయ్యి బాతులను పెంచుతోంది. ఎక్కువగా నీటిసౌకర్యం కలిగిన చెరువులతో పాటు సేద్యం చేస్తున్న పొలాల్లో లభించే పురుగులు వీటికి ఆహారం కావడంతో వివిధ ప్రాంతాలను అన్వేషిస్తూ గంగాధరనెల్లూరు మండలం ఆత్మకూరు పంచాయతీ దేవళంమిట్ట పరిసర ప్రాంతాలకు ఆ కుటుంబం తోలుకొచ్చింది.సుమారు ఒకటిన్నర నుంచి రెండు కిలోల దాకా బరువు పెరగడానికి బాతులకు ఐదు నెలలు పడుతుందని, అయితే ఆ ఐదు నెలల కాలం వాటికి ఆహారం లభించే ప్రాంతాలకు తోలుకొని వెళ్ళడమే కాకుండా వాటి భద్రత తమకు ఎంతో కష్టమవుతోందని యజమాని తెలిపారు. ఐదు నెలల తర్వాత అవి గుడ్లు పెట్టడం ప్రారంభిస్తాయని, బాతు గుడ్లతో పాటు వాటి మాంసానికి మంచి డిమాండు వుండడంతో కష్టమైనా ఈ పనినే కొనసాగిస్తున్నామన్నారు.

నేడు రైతు సేవా కేంద్రాల్లో యూరియా అమ్మకాలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో, ఎరువుల దుకాణాల్లో 600 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉండగా, వ్యవసాయ శాఖ వద్ద 2600 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయి. ఇందులో 600 మెట్రిక్ టన్నులు యూరియాను జిల్లాలోని 502 రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం అందుబాటులో ఉంచనున్నారు. ఈ క్రమంలో రైతులందరికీ యూరియా పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖాధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన మేరకు యూరియా నిల్వలు రైతు సేవా కేంద్రాలతో పాటు ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

నానో డీఏపీ వాడకం మంచిది

యూరియా వాడకాన్ని తగ్గించి నానో డీఏపీ వాడడానికి రైతులు అలవాటు పడాలని వ్యవసాయశాఖాధికారులు సూచించారు. రసాయన ఎరువులు ఉపయోగించే ముందు వ్యవసాయశాఖాధికారులు, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జిల సలహాలు తీసుకోవాలని కోరుతున్నారు. యూరియా అధిక వినియోగం తగ్గించి నేల సారాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు



కల్లూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీ ఆర్ భరోసా పింఛన్ల నగదు సకాలంలో అందక గంటల తరబడి లబ్ధిదారులు ఎదురు చూడాల్సి వచ్చింది. ఈ ఘటన పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ దాసరిగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. కల్లూరు సచివాలయం-1 పరిధిలోకి వచ్చే దాసరిగూడెం ప్రాంతంలో 61 మంది పింఛను లబ్ధిదారులు ఉన్నారు. వీరంతా ఉదయం తమ తమ ఇళ్ల వద్ద నగదు తీసుకునేందుకు ఎదురు చూశారు. వీఆర్వో మౌనిక పింఛను పంపిణీ చేయాల్సి ఉంది. ఈమె 9 మంది లబ్ధిదారులకు మాత్రమే పింఛన్ ఇచ్చి వెళ్లిపోయింది. మిగిలిన వారు వీధుల్లో కూర్చొని ఆమెకోసం పడిగాపులు కాచారు. మధ్యాహ్నం 3 గంటల వరకూ పింఛన్ నగదు ఇచ్చేందుకు వీఆర్వో రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. దీనిపై ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి నాగరాజును వివరణ కోరారు. ఆ విషయం తెలుసుకున్న వీఆర్వో హుటాహుటిన దాసరిగూడెం చేరుకొని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు.

షోకాజ్ నోటీసు ఇస్తాం

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీఆర్వోకు షోకాజ్ నోటీసు ఇస్తాం. ఉదయమే లబ్ధిదారుల ఇళ్లకెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. వీటిని అతిక్రమిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం . - ఎంపీడీవో రాజశేఖర్‌బాబు

అసహాయులకు అండగా ప్రభుత్వం

కుప్పం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అసహాయులకు అండగా పలు పథకాలు అమలు చేస్తున్నదని పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కుప్పం పురపాలక సంఘం 11వ క్లస్టర్ పరిధిలో సోమవారం క్లస్టర్ టీడీపీ ఇన్‌చార్జి కన్నన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, నియోజకవర్గ టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు బాబు, 11వ కో క్లస్టర్ ఇన్‌చార్జి తిరుమగళ్, డీకేపల్లె మణి, అప్పు ముఖేశ్, నాయకులు వేలు, రవి, అల్లాబక్ష్, పాల్గొన్నారు.

రామకుప్పం: టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజనేయరెడ్డి మండల పరిధిలోని పలుగ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.

చిత్తూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ



సోమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చెన్నమ్మకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ మణికంఠ చిత్తూరుకు వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. సోమల మండలం అడుసుపల్లెకు చెందిన చెన్నమ్మ మూడు నెలలు క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడింది. వేలూరు సీఎంసీ వైద్యశాలలో చికిత్స పొందింది. మూడుల నెలల నుంచి పింఛను తీసుకోలేకపోయింది. ఆమె ఆర్థిక పరిస్థితి గుర్తించిన మణికంఠ, ఉపాధి హామీపథకం క్షేత్ర సహాయకుడు శ్రీనివాసులు కలిసి చిత్తూరులో ఉంటున్న చెన్నమ్మ వద్దకు వెళ్లి మూడు నెలల పింఛన్ అందజేశారు. వీరిని ఎంపీడీవో నారాయణ, అధికారులు అభినందించారు.

ఇకపై నెల పొడవునా రేషన్ సరుకులు

శాంతిపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇకపై రేషన్ దుకాణాలలో నెల పొడవునా రేషన్ సరుకులు లబ్ధిదారులు తీసుకోవచ్చని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయ రామిరెడ్డి అన్నారు. సోమవారం శాంతిపురం, పెద్దబొమ్మనపల్లె, మఠం గ్రామాల్లోని రేషన్ దుకాణాలలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివయ్య, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, సింగిల్ విండో ఛైర్మన్ గోపాల్, రాళ్లబూదుగూరు మాజీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మాజీ ఏఎంసీ వైస్ ఛైర్మన్ నాగరాజు, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు జయపాల్, రమేష్, మంజునాథ్, రేషన్ డీలర్లు మంజునాథ్, ఆదినారాయణ, నారాయణమ్మ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

వి.కోట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వి.కోటలోని పలమనేరు రోడ్డులో పాల డెయిరీ ఎదురుగా పంచాయతీ ట్రాక్టర్‌ను ఢీకొని బోయచిన్నాగన పల్లెకు చెందిన కిషోర్ అనే యువకుడు గాయపడ్డాడు. సోమవారం పంచాయతీ సిబ్బంది సిద్ధార్థనగర్ సమీపంలో చెత్త తొలగించేందుకు రోడ్డుపై ట్రాక్టర్‌ను ఉంచారు. కిషోర్ పలమనేరు వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తూ ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ వెనుకవైపు ఢీకొన్నాడు. గాయపడిన యువకుడి పరిస్థితి విష మంగా ఉండటంతో కుప్పం పీఈఎస్‌కు తరలించారు. సీఐ సోమశేఖర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుంగనూరు అసెంబ్లీ ఎస్డీపీఐ అధ్యక్షుడిగా సిద్దిక్

పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): పుంగనూరు అసెంబ్లీ ఎస్డీపీఐ నూతన కమిటీ అధ్యక్షుడిగా సిద్దిక్, కార్యవర్గాన్ని ఎన్నిక చేసినట్లు ఆ పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి మహ్మద్ ఘనీ, జిల్లా ప్రధానకార్యదర్శి రోషన్‌యూనుస్ తెలిపారు. సోమవారం స్థానిక ఎస్డీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నూతన అధ్యక్షుడిగా సిద్దిక్, ఉపాధ్యక్షుడిగా ఖాదర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా ఆసిఫ్, కార్యదర్శిగా షామీర్, కోశాధికారిగా సద్దాం, సభ్యులుగా అబ్దుల్ కలందర్, అబ్దుల్ రషీద్, చాంద్‌బాషా, నౌషాద్, వి.అతిక్‌బాషా, మహ్మద్‌అలీ, రాయల్‌బాబా, తోఫిక్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేబీ.మహ్మద్‌చాంద్‌బాషా, కేఎస్ అన్వర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ఆదర్శం మునస్వామయ్యశెట్టి

పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం కృషి చేసిన ఎస్పీ మునస్వామయ్యశెట్టిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పుంగనూరు సంఘ అధ్యక్షుడు కె.బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో మునస్వామయ్యశెట్టి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

91 శాతం పింఛన్ల పంపిణీ

పలమనేరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపాలిటీలో సోమవారం 91 శాతం మందికి పెన్షన్ అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో మొత్తం 4537 మంది పెన్షనర్లు వుండగా వారిలో 4128 మందికి పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన వారికి 2వ తేదీ మంగళవారం అందజేస్తామని వివరించారు.

రూ.42వేలు పలికిన మార్కెట్ వినాయక లడ్డూ

పలమనేరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో వినాయక చవితి సందర్భంగా మార్కెట్ కమిటీ వద్ద వినాయకుడి ప్రతిమ వద్ద ఉంచిన లడ్డూ వేలంలో రూ.42వేలు పలికింది. మండీ వ్యాపారి నరేష్‌కుమార్ వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.

డ్వాక్రా సంఘాలకు రూ.20 కోట్ల రుణాలే లక్ష్యం

చౌడేపల్లె, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూప్‌లకు ఈ ఏడాది రూ.20 కోట్లు రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏపీఎం సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎంజీ రేఖ, సీసీలు సుగుణ, నాగరత్నమ్మ, రమేష్, శ్రీనివాసులు, వీవో సభ్యులు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



మృతుడు బాలాజీ

గంగవరం, సెప్టెంబరు1 (ఆంధ్ర జ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతిచెందాడు. ఈ ఘటనల మండలంలోని బొమ్మనపల్లెలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యుల కథనం మేరకు.. బొమ్మనపల్లె గ్రామానికి చెందిన బాలాజీ(41) గంగవరంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అలాగే ఇంటి వద్ద పాడి ఆవులు మేపుతూ జీవనం సాగించేవాడు. పెద్దల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తికి సంబంధించి బాలాజీతో అతడి పిన్నమ్మ ఆదివారం గొడవపడింది. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతడిని స్టేషన్‌కు పిలిచారు. సోమవారం స్టేషన్‌కు వెళ్లాలని భావించాడు. సోమవారం వేకువజామున గ్రామ సమీపంలోని ఆవుల షెడ్డు వద్దకు పాలు పితకడానికి వెళ్లాడు. ఉదయం 9 గంటల వరకు ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు అనుమానంతో షెడ్డువద్దకు వెళ్లిచూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. షెడ్డు కేవలం 8 అడుగుల ఎత్తు ఉండడం అతడి కాళ్లు నేలను తాకుతూ ఉండడంతో అనుమానం వ్యక్తం చేశారు. ఆస్తి తగాదాలతోనే బాలాజీని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ పింఛన్లు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ బరోసా పింఛన్లు అందజేస్తున్నట్లు పుంగనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎన్. శమిపతి, మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణా నాయక్, నాయకులు రామకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకే స్మార్ట్ కార్డులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌కార్డులు తీసుకున్న లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులని పుంగనూరు తహసీల్దార్ జె.రాము పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఏటవాకిలి పంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన మహిళలకు పంపిణీ చేశారు. ● మండలంలోని మోదుగులపల్లె, సుగాలిమిట్ట ప్రాంతాల్లో జనసేన నాయకులు విరూపాక్షి, బాలాజీనాయక్, హరినాయక్‌లు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు.

పదేళ్లవుతున్నా పరిష్కరించరా?

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురి వినతులు ● అర్జీలు స్వీకరించిన ఆర్డీవో భవాని

పలమనేరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమ వారం డివిజన్ పరిధిలోని పలుమండలాల నుంచి వచ్చిన రైతులు రెవెన్యూ సమస్యలపై ఆర్డీఓ భవానికి వినతిపత్రాలు అందజేశారు. భూరీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాల్లో పొరబాట్లు, దారి సమస్యలపైనే అధికంగా వినతులు వచ్చాయి.



● పెద్దపంజాణి మండలం కోగిలేరు గ్రామ దాఖలాలో మాకు 1.21 ఎకరాల పొలం ఉంది. ఈ భూమిని మేము ఎవరికీ విక్రయించలేదు. అయితే మా భూమిని పెద్దపంజాణి రెవెన్యూ అధికారులు వేరేవారి పేరున రికార్డుల్లో నమోదు చేశారు. దీనిపై తాము 2016లో మదనపల్లి ఆర్డీవో వద్ద ఆర్ఓఆర్ అప్పీలు చేసుకున్నాం. పలమనేరు రెవెన్యూ డివిజన్ ఏర్పడిన తరువాత మదనపల్లి ఆర్డీవో పలమనేరుకు వెళ్లమని సూచించారు. పదేళ్లయిపోయినా ఇప్పటి వరకు మా అప్పీలు పై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఇకనైనా స్పందించి తమ ప్రతివాదులకు నోటీసులు ఇచ్చి న్యాయం చేయాలి.

- సుబ్బలక్ష్మి, మహిళారైతు

ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తి పరం



గ్రామంలోని పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని రెవెన్యూ వారు ప్రైవేటు వ్యక్తిపేరున ఆర్ఓఆర్, వన్‌బీలలో రికార్డుల్లో నమోదు చేశారని పెద్దపంజాణి మండలం అప్పినపల్లికి చెందిన గ్రామస్తులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకొంటామని ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



రొంపిచెర్లలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే ఏడాది పాలనలో ఎన్నడూ చూడని అభివృద్ధి జరిగిందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా చల్లాబాబు మాట్లాడుతూ మండలంలో 28 చౌకదుకాణాలకు సంబంధించి 8,7045 కార్డులు ఇస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఏవో శ్రావణి, పశువైద్యాధికారి రాణి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, సింగిల్ విండో ఛైర్మన్ రఘునాథరెడ్డి, వైస్‌ఎంపీపీ నూలురెడ్డెప్ప, మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ అమరనాథరెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు రఘునాథ్, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో చల్లా రామచంద్రారెడ్డి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపణీ చేశారు. మండలంలో 32 చౌకదుకాణాల ద్వారా 12551 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తామని వివరించారు. తహసీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్, ఏపీవో సౌభాగ్యవతి, ఏపీఎం చంద్రమోహన్, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, సింగిల్ విండో అధ్యక్షులు ధనంజయనాయుడు, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, మురళీధర్ నాయుడు, నారాయణస్వామినాయుడు, రాణెమ్మ, చెంగ్రాలయనాయుడు, శంకర్, నజీర్‌బాషా, రమణ, వెంకట్రామా నాయుడు, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



తారురోడ్డు పనుల భూమిపూజలో టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే రాష్ట్రంలో గ్రామీణ రహదార్లకు మహర్దశ పట్టిందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షులు అంజనేయరెడ్డి తెలిపారు. సోమవారం రామకుప్పం పట్టణ శివార్లలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం నుంచి మిట్టపల్లె వరకు రూ.1.44కోట్ల అంచనాతో చేపట్టిన తారురోడ్డు నిర్మాణపు పనులకు వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల ప్రజల సౌకర్యంతో బాటు వివిధ ప్రాంతాల నుంచి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు కూడా సౌకర్యంగా ఉండేలా ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రెస్కో వైస్‌ఛైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో ఛైర్మన్ మహ్మద్‌రఫీ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, మైనారిటీ సెల్ జిల్లా కార్యదర్శి సలాంసాబ్, నేతలు రామలింగారెడ్డి, అవినాశ్, బాలరాజు, విజయ్‌కుమార్‌రెడ్డి, మంజునాథ్, కేశవరెడ్డి, హరికృష్ణ, మణీంద్రంనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీకే స్మార్ట్‌కార్డులు

రామకుప్పం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ సరుకుల పంపిణీని పారదర్శకంగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందిస్తోందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం తెలిపారు. సోమవారం మండల పరిధి పెద్దకురబలపల్లెలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. రామాపురంతాండాలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, రెస్కో వైస్‌ఛైర్మన్ విశ్వనాథ్, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజనాయక్, మణీంద్రంలో ఎంపీటీసీ అరుణజ్ఞానశేఖర్, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు మంజునాథరెడ్డి, ఆత్మా మాజీ డైరెక్టరు రామలింగారెడ్డి, కెంచనబల్లలో బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, యూనిట్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు సత్తి, ఆవులకుప్పంలో తెలుగుయువత మండల ప్రధానకార్యదర్శి వెంకటాచలం స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు గంట్లప్పగౌడు, చంద్రశేఖర్‌రెడ్డి, గుణశేఖర్, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

వి.కోట కురబ సంఘం అధ్యక్షులుగా కృష్ణప్ప



నూతన కమిటీని సన్మానిస్తున్న కురబ నాయకులు

వి.కోట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వి.కోట మండల కురబ సంఘం నూతన కమిటీని రాష్ట్ర గౌవవాధ్యక్షులు నాగభూషణం ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. సోమవారం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో జరిగిన మండల స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా దొడ్డిపల్లెకు చెందిన ఎం.సీ.కృష్ణప్ప, ఉపాధ్యక్షులుగా యాకల్లుకు చెందిన శంకరప్ప, ప్రధాన కార్యదర్శిగా కమ్మేపల్లెకు చెందిన సి.అమరనాథ్‌గౌడు, కోశాధికారిగా బెల్లకుంటకు చెందిన కే.అమరనాథగౌడు, గౌరవ అధ్యక్షులుగా బి.సీ.పల్లెకు చెందిన జయప్ప, చింతమాకుల పల్లెకు చెందిన రాధాకృష్ణగౌడు, యూత్ అధ్యక్షులుగా వెంకటేపల్లెకు చెందిన సురేష్‌లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కురబ సంఘనేతలు ఈశ్వర్, విశ్వనాథ్, బాలరాం, బాలకృష్ణ, జయరామేగౌడు, మూర్తి, ఉమాపతి తదితరులు ఉన్నారు.

పేదల మనిషి చంద్రన్న : గౌనివారి

శాంతిపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : దేశంలో ఏ రాష్ట్రంలోను అమలు చేయని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తూ పేదల మనిషిగా కీర్తిగడించారని మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాడు విజన్-2020 విజయవంతంగా చేపట్టి, నేడు స్వర్ణాంధ్ర విజన్- 2047కు శ్రీకారం చుట్టారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడంతో పాటు అసమానతలు తగ్గించేందుకు అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్‌లు, దీపం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, స్త్రీశక్తి, తల్లికి వందనం వంటి ఎన్నో కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. 30 ఏళ్ల ప్రస్థానంలో యువశక్తిని ప్రోత్సహించేందుకు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకువచ్చి లక్షలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి 2014-19 మధ్య కాలంలో రూ.79,742 కోట్లు వ్యయం చేయగా, అందులో రాయలసీమకు రూ.14,191 కోట్లు ఖర్చు చేశారన్నారు. కరువు ప్రాంతమైన కుప్పానికి హంద్రీ నీవా కాలువ ద్వారా కృష్ణమ్మ జలాలను తీసుకువచ్చిన అపర భగీరథుడిగా నిలిచారన్నారు. పేదరిక నిర్మూలన కోసంపీ-4 విదానాన్ని తీసుకువచ్చారని పేర్కొన్నారు.

అధిక వడ్డీలు చెల్లించలేక బేకరీ వ్యాపారి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీలు చెల్లించలేక ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన సోమవారం పుంగనూరులో వెలుగుచూసింది. బాధితుడి కథనం మేరకు.. పుంగనూరు గాంధీనగర్‌కు చెందిన అమీర్‌బాషా కుమారుడు సద్దాం బేకరి నడుపుతూ జీవనం సాగించేవాడు. పెట్టుబడుల కోసం స్థానిక నక్కబండకు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.1.50లక్షలు అప్పు తీసుకున్నాడు. రూ.1000కి మూడు రోజులకు రూ.100 చెల్లించేలా ఒప్పందం చేసుకున్నాడు. డబ్బులు సకాలంలో చెల్లించకపోవడంతో వడ్డీ వ్యాపారి ఒత్తిడి చేశాడు. దీంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నిం చాడు. కుటుంబసభ్యులు గుర్తించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రజలకు తాగునీటి సమస్య

సోమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సోమలలోని పుంగనూరు - తిరుపతి రోడ్డు ప్రధాన రోడ్డు కు ఇరువైపులా కృష్ణదేవరాయల సర్కిల్ ప్రాంతాల ఇళ్లకు 15 రోజులుగా తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సచివాలయంలో కార్యదర్శికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. పుంగనూరు- తిరుపతి మార్గంలో విద్యుత్‌శాఖ కొత్త విద్యుత్ లైన్ స్తంభాలు ఏర్పాటుతో తాగునీటి పైపులైన్ దెబ్బతింది. అప్పటి నుంచి తాగునీటి సరఫరా ఆపేశారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టర్ పగిలిన పైపులైన్‌కు మరమత్తులు చేయకపోవడంతో తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సోమల - కలికిరి మార్గంలో కొత్త విద్యుత్ లైన్ కోసం పలు చోట్ల రైతులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా పలు వృక్షాలను నరికివేయడంపై స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కందూరులో వినాయక నిమజ్జనం

సోమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కందూరులో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమ వారం బోయవీధిలో ప్రతిష్ఠించిన స్వామి వారిని బాణసంచా వేడుకలతో నిమజ్జనం చేశారు. కాగా పలు గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించారు. సూరయ్యగారిపల్లెలో స్వామివారి లడ్డూను అత్తే కళ్యాణ్ కుమార్ రూ. 13,001, బొడ్డులోని కాయిన్ రూ. 12,050, ఇరికిపెంటలో బంగారు నాణెంను గల్లా పార్థ సారథి రూ2లక్షలు, లడ్డూను కొల్లా ప్రవీణ్‌కుమార్ రూ.37 వేలుకు, వెండి కాయిన్‌ను గుత్తా రాజేంద్ర నాయుడు రూ. 67వేలుకు దగ్గించుకున్నారు. అలాగే సోమల జయంతి కాలనీలో లడ్డూను వీ.స్వాతి రూ. 14,500, బొడ్డులోని నాణెంను మిథున్ రూ.6,500ను దక్కించుకున్నారు.

రెవెన్యూ సమస్యలపై చొరవ తీసుకోండి

సోమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించ డానికి వీఆర్వోలు ప్రత్యేక చొరవ చూపాలని తహసీల్దార్ మధుసూదన్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం వీఆర్వోలతో అర్జీలపై సమీక్షించారు. సమస్యలను, భూవివాదాలను క్షేత్రస్థాయి సందర్శనలతో ఇరువర్గాల సమక్షంలో వాటిని పరిష్కరిం చాలన్నారు. రేషన్ పంపిణీపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చౌకదుకాణాలను సందర్శించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ సుబుక్తుల్లా, వీఆర్వోలు పాల్గొన్నారు.

కేసులున్న వారిని అనర్హులు చేయండి



ఈవో ఏకాంబరంకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

చౌడేపల్లె, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): పోలీసు కేసులున్న వారిని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ పాలక వర్గం సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించాలని సింగిల్ విండో ఛైర్మన్ పగడాల హరిప్రసాద్ ఆలయ ఈవో ఏకాంబరాన్ని కోరారు. సోమవారం ఆయన టీడీపీ, జనసేన నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్తీక్, పణి, సాగర్ నాయుడు, ఈశ్వర్, జనసేన నాయకులు చరన్, నరేష్, రాకీ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

శాంతిపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల సచివాలయం ఎదుట ఉన్న ప్రభుత్వ భూమిని తహసీల్దారు శివయ్య తన సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా కొన్ని భవనాలు, కొంత ఆక్రమణకు గురైందని ఉన్నత అధికారుల దృష్టికి వెళ్లడంతో వారి ఆదేశాల మేరకు పరిశీలించినట్లు తహసీల్దారు శివయ్య తెలిపారు. రికార్డులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నెలంతా రేషన్ హర్షణీయం

సోమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో నెలరోజులూ సరుకులు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమని ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఇరికిపెంటలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయం



క్యాన్సర్ వ్యాధిపైన ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీరామకృష్ణ

శాంతిపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్‌నాయుడు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హైదరాబాద్‌కు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వారు ప్రారంభించి ప్రసంగించారు. క్యాన్సర్ బాధితుల గురించి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన బసవతారకం ఇండో అమెరికన్ ఆస్పత్రి ఛైర్మన్ బాలక్రిష్ణతో మాట్లాడి కుప్పం నియోజకవర్గంలో అన్ని మండలాల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని కోరారన్నారు. వెంటనే ఆస్పత్రి వైద్య బృందాన్ని పంపించి శిబిరాలు ఏర్పాటు చేయించారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్మన్ గోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, మాజీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, మురుగేష్, సింగిరి శ్రీనివాసులు, ఈడిగ శివశంకర్, ఉయ్యాల జయరామిరెడ్డి, మాజీ ఎంపీపీ పుష్ప, ఏఎంసీ డైరెక్టర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విశేష స్పందన



చికిత్స చేస్తున్న వైద్యులు

ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల శిబిరానికి విశేష స్పందని లభించింది. సుమారు 376 మందికి వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. 17 మందిని పెద్దాసుపత్రులకు వెళ్లాలని రెఫర్ చేశారు. చికిత్సల కోసం శిబిరానికి తరలి వచ్చిన ప్రజలకు విజయరామిరెడ్డి ఉచిత భోజన వసతి కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వంశీకృష్ణ, ప్రసాద్‌లు క్యాన్సర్ వైద్య బృందానికి అన్ని ఏర్పాట్లను చేశారు. ఈ కార్యక్రమంలో బసవతారకం ఇండో అమెరికన్ ఆస్పత్రి మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ శ్రీరామకృష్ణ, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రావణకుమారి, డాక్టర్ రేణుక, డాక్టర్ ప్రవల్లిక, సిబ్బంది కృష్ణప్రసాద్, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరును నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా: థామస్



మహిళలకు స్త్రీనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. సోమవారం వెదురుకుప్పం మండలం ధర్మాచెరువులో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పింఛను సొమ్మును పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారు. నాలుగు సంఘాలకు రూ.17.50 స్త్రీనిధి రుణాల చెక్కులను అందజేశారు. తర్వాత స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. కుప్పం తర్వాత జీడీనెల్లూరులోనే అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. పరిశ్రమల హబ్‌గా మార్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. ఇక ధర్మాచెరువు ప్రజలపై వరాల వర్షం కురిపించారు. శ్మశాన వాటిక, డ్రైనేజీల ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ తదితర వాటితోపాటు ఇతర వసతుల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దగుల్బాజీ పార్టీ(వైసీపీ)లో ఉండకుండా టీడీపీలో ఉంటూ అభివృద్ధి పనులకు సహకరించాలని యువతకు పిలుపునిచ్చారు. తహసీల్దార్ బాబు, ఎంపీడీవో పురుషోత్తం, ఏపీఎం పరశురామిరెడ్డి, సీసీ మాధవరెడ్డి, సీఐ హనుమంతప్ప, గ్రామకార్యదర్శి కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళి, టీడీపీ నేతలు సాతాల గుణశేఖర్ యాదవ్, నేసనూరు మునిచంద్రారెడ్డి, ఈశ్వరరెడ్డి, విశ్వనాథంయాదవ్, జనసేన ఇన్‌చార్జి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్: మురళీమోహన్



లబ్ధిదారుకు పింఛను సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

ఐరాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టడానికే ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే మురళీ మోహన్ తెలిపారు. సోమవారం వీఎస్ అగ్రహారంలోని సంతలో బహిరంగ సభ నిర్వహించి, లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేస్తుందన్నారు. అనంతరం దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు, వృద్ధులకు, వితంతువులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు. నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, సింగిల్ విండో అధ్యక్షుడు శేషాద్రినాయుడు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుధాకర్, దయానందమందడి, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు: కలెక్టర్



నేత్రదాన పక్షోత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంతో ఇద్దరికి చూపు ఇవ్వొచ్చని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా నేత్రదాన పక్షోత్సవాల బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. గతనెల 25 నుంచి ఈనెల 8వ తేదీవరకు నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. నేత్రదానం కుటుంబ బాధ్యతగా పాటించాలన్నారు. డీఎంహెచ్‌వో సుధారాణి, డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి, జిల్లా అంధత్వ నివారణ అధికారి అర్పిత, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి: ఎస్పీ



మునస్వామి దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందినవారు తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఎస్పీ మణికంఠ సూచించారు. పాలసముద్రం ఏఎస్ఐగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మునస్వామిని సోమవారం స్థానిక పోలీసు అతిథిగృహం సన్మానించారు. ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానంద కిశోర్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, ఆర్ఐ సుధాకర్, ఏవో నాగభూషణమ్మ, అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిశీలించండి: కమిషనర్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించగా 10 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. ఇంజనీరింగ్, రెవెన్యూశాఖలకు నాలుగు చొప్పున, పబ్లిక్‌హెల్త్‌కు, పింఛన్‌కు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు ఉన్నాయి. ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న మినీ లారీ: ఇద్దరికి గాయాలు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని కేజీ సత్రం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులు గాయపడ్డారు. తవణంపల్లె మండలం సరకల్లుకు చెందిన రఘునాథరెడ్డి, పవనకుమారిలు బైక్‌లో తంబుగానిపల్లె నుంచి యాదమరి వైపు వెళుతున్నారు. కేజీ సత్రం మలుపు వద్ద రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న మినీలారీ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలవడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు పెద్దపీట

● చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారని చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 ఏళ్లలో నాలుగుసార్లు సీఎంగా ప్రజలకు సేవలందించి రాష్ట్రాభివృద్ధికి మార్గదర్శిగా నిలిచారన్నారు. ఆయన తీసుకొచ్చిన పథకాలు, సంస్కరణలు రాష్ట్ర భవిష్యత్‌ను మార్చేశాయని వివరించారు. బాలిక విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలియజేశారు.



రఘు - వంశీ చౌదరి - యువకృష్ణ

చిత్తూరు రూరల్ టీడీపీ అధ్యక్షుడిగా రఘు

చిత్తూరురూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండల అధ్యక్షుడిగా రఘు, తెలుగు యువత అధ్యక్షుడిగా వంశీ చౌదరి, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా గోళ్ల యువకృష్ణ ఎన్నికయ్యారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా గురేష్, క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడిగా సామివేల్, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఉస్మాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కందస్వామి, తెలుగు రైతు అధ్యక్షుడిగా సుధీర్‌లను నియమించారు.

గుడిపాల అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం నాయుడు



సుబ్రహ్మణ్యం నాయుడు - ధనసింగ్ - చల్లా

గుడిపాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండల టీడీపీ అధ్యక్షుడిగా రెండోసారి చలిచీమల సుబ్రహ్మణ్యం నాయుడిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ధనసింగ్, ప్రధాన కార్యదర్శిగా బాలసుబ్రహ్మణ్యం యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మోహన్ కృష్ణ, రవికుమార్ రెడ్డి, పయని, కార్యదర్శులుగా గోవిందస్వామి, విక్టోరియా, గోపి, సురేష్ బాబు, తెలుగు యువత మండల అధ్యక్షుడిగా చల్లా, బీసీ సెల్ అధ్యక్షుడిగా జయచంద్ర, వైస్ ప్రెసిడెంట్‌గా దొరబాబు, జనరల్ సెక్రటరీగా రవియాదవ్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

● ఎమ్మెల్యే జగన్మోహన్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో పార్టీ చిత్తూరు నియోజకవర్గ ప్రధాన, అనుబంధ విభాగాల కమిటీల కార్యవర్గాలను ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసేవారిని పార్టీ గుర్తిస్తుందని స్పష్టం చేశారు. ఇంకా పలు అనుబంధ విభాగాలు ప్రకటించాల్సి ఉందని, వాటిల్లోనూ కార్యకర్తలకు పదవులు వస్తాయన్నారు. పార్టీ సీనియర్ నేతల అభిప్రాయాలతో కమిటీల నియామకం చేపట్టడం జరిగిందని తెలిపారు. పదవులు పొందినవారు పార్టీ అభివృద్ధికి కృషి చేయకుంటే తొలగించే అధికారం తమకుందని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ప్రతిపక్షాల ఆరోపణలు, అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. అదే సమయంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ చిత్తూరు నియోజకవర్గ పరిశీలకులు శ్రీధర్ వర్మ, రాంప్రసాద్ రెడ్డి, రెడ్డెప్ప, గిరినాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కాండ్ర రమేష్ నాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ వెంకటేష్ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



నరేష్ - పచ్చప్ప - నళిని తిరుకుమరన్ - సబిత - ఉదయ్ కుమార్ - గోకుల్ ఆదిత్య - టీఆర్ జనార్దన్ నాయుడు

చిత్తూరు టీడీపీ నగరాధ్యక్షుడిగా నరేష్

చిత్తూరు టీడీపీ నగరాధ్యక్షుడిగా తుంగ నరేష్, ప్రధానకార్యదర్శిగా పచ్చప్ప, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా రాధాకృష్ణ, తెలుగు యువత అధ్యక్షుడిగా గోకుల్ ఆదిత్య, ప్రధాన కార్యదర్శిగా సురేంద్ర కుమార్, ఐటీడీపీ అధ్యక్షుడిగా సాయి కుమార్, ప్రధాన కార్యదర్శిగా సాయికృష్ణ, తెలుగు మహిళ అధ్యక్షురాలిగా నళిని తిరుకుమరన్, ప్రధానకార్యదర్శిగా సబిత, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గుణ, ప్రధానకార్యదర్శిగా రుద్ర, తెలుగురైతు అధ్యక్షుడిగా ఏకాంబరం, ప్రధానకార్యదర్శిగా పయణి, వాణిజ్యవిభాగం అధ్యక్షుడిగా టీఆర్ జనార్ధన్‌నాయుడిని నియమించారు. అలాగే నగరంలోని 50 డివిజన్లకు 12 మంది క్లస్టర్ ఇన్‌చార్జిలను నియమించారు. వీరిలో.. సీఎస్ త్యాగరాజన్, రాజేష్ కుమార్ రెడ్డి, ఈశ్వర్ రావు, దేవరాజులు, శివకుమార్, నరేష్, వరదరాజులు, భువనేశ్వరి, మోహన్, మంజూష్ కుమార్, శరత్ బాబు, దీపశ్రీ ఉన్నారు.





కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ఆస్థాన మండపంలో నృత్యాలు చేస్తున్న కళాకారులు - సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవర్లను తీసుకొస్తున్న ఉభయదారులు, ఈవో పెంచలకిషోర్

వరసిద్ధుడి సేవలో ఉత్తరప్రదేశ్ మంత్రి



ఉత్సవర్లను తీసుకొస్తున్న కపిల్‌దేవ్ అగర్వాల్, ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ విద్యాశాఖా మంత్రి కపిల్‌దేవ్ అగర్వాల్ సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను చేశారు. డీఈవో సాగర్‌బాబు, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గంగజాతరకు చాటింపు



పాలసముద్రం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకావేరిరాజుపురంలో ఆదివారం రాత్రి గంగజాతరకు చాటింపు వేసి, సోమవారం గ్రామంలో గరిగెను గ్రామస్తులు ఊరేగించారు. చెరువు మొరవ వద్ద గంగమ్మకు పూజలు చేసి, గ్రామ పొలిమేరల చుట్టూ పొలి చల్లి చాటింపు వేశారు.

సామాలమ్మ ఆలయం ముస్తాబు



నగరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరి జాతర చాటింపునకు సామాలమ్మ ఆలయం ముస్తాబైంది. ఆలయంవద్ద వేదికను నిర్మించి, పరిసరాలు శుభ్రం చేయించినట్లు నిర్వాహకుడు రామనుజం చలపతి తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన పీఆర్ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నవీన్ కుమార్ పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో వీరిద్దరూ కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

'పెన్షన్ మార్చ్'లో జిల్లా ఉద్యోగులు



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగులు సోమవారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో పెన్షన్ మార్చ్ కార్యక్రమం చేపట్టారు. ఇందులో సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సమీర్, నాయకులు నరసింహ, అమరేంద్ర, రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పింఛను భిక్ష కాదు: యూటీఎఫ్

ఐరాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పింఛను భిక్షకాదు.. ఉద్యోగి హక్కు అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిర్వహించిన 'పెన్షన్ మార్చ్' కార్యక్రమానికి సోమవారం కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లోని టీచర్లు, ఉద్యోగులతో కలిసి మద్దతు తెలిపారు. పాఠశాల ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. హెచ్ఎం గోపీనాథరెడ్డి పాల్గొన్నారు.

'శ్మశానానికి స్థలమివ్వండి'

గుడిపాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్మశానానికి స్థలాన్ని కేటాయించాలని సోమవారం చలిచీమలపల్లె, కొత్తపల్లె గ్రామస్తులు కోరారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. శ్మశానం లేక చెరువులో దహనక్రియలు నిర్వహిస్తున్నామని, వర్షం వచ్చినప్పుడు నీళ్లు వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి స్థలాన్ని కేటాయించాలని కోరారు.

టీడీపీ పాలనలోనే ఈడిగలకు సముచితస్థానం

ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే ఈడిగలకు సముచితస్థానం లభించిందని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయ ప్రాంగణంలో జరిగిన చిత్తూరు జిల్లా ఈడిగ బీసీ సాధికార సమితి ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మద్యం దుకాణాలు, బార్ లైసెన్సుల్లో ఈడిగలకు పది శాతం కేటాయించిందన్నారు. అనంతరం గౌడవాణి మాసపత్రికను ప్రారంభించారు. ఇదే కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుస్సా నాగరాజ గౌడ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, మాజీ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, గురుజాల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చెన్నకేశవులునాయుడు, ఎన్పీ జయచంద్రనాయుడు, సురేంద్రనాయుడు, జిల్లా ఈడిగ సంఘ అధ్యక్షుడు క్రిష్ణమూర్తిగౌడ్, గోపిగౌడ్, జనార్ధన్‌గౌడ్, గౌడవాణి ఎడిటర్ అనుమోలు విజయకుమార్ గౌడ్, అట్లూరి వేణుగోపాల్ గౌడ్, తోయజాక్షులుగౌడ్, నీరజాక్షులుగౌడ్, మహేంద్రగౌడ్, లేబాకుల మురళీ గౌడ్‌లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాని తల్లిపై అసభ్యకర వ్యాఖ్యలా?

● రాహుల్‌గాంధీపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బీజేపీ



రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్‌పై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అసభ్యకర వ్యాఖ్యలు చేయడం తగదని బీజేపీ నాయకుడు చిట్టిబాబు అన్నారు. రాహుల్‌గాంధీపై చర్యలు తీసుకోవాలంటూ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. బ్రహ్మానందరెడ్డి, రెడ్డిమస్తాన్, షంషేర్‌భాషా, ఉదయ్ కుమార్, సునీల్ కుమార్, హేమంత్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు సెంట్రల్: మోదీ తల్లిపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

వెదురుకుప్పం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించారు. ఎంఈవో దామోదరం, ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ హనుమంతురెడ్డి పరిశీలించారు.

ఇంటి ప్రహరీని కూల్చేశారు: బాధితురాలి ఆవేదన



కూల్చేసిన గోడ

విజయపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంటి ప్రహరీని కూల్చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తమిళనాడు రాష్ట్రం కాంజపాడికి చెందిన వనిత సోమవారం మీడియాకు వివరాలు తెలిపారు. ఆమె మాటల్లోనే.. '11 ఏళ్ల కిందట మల్లారెడ్డికండ్రిగ బీసీ కాలనీకి రెండు కిలోమీటరు దూరంలో గ్రామ కంఠానికి చెందిన ఇంటి స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వ్యక్తి దగ్గర నేను కొనుగోలు చేశా. ఆయన చూపిన 116వ ప్లాటులో ఇంటిని కట్టుకుని, ప్రహరీ నిర్మించుకున్నా. ఇది ఇద్దరు స్థానికులకు గిట్టలేదు. బయటి ఊరి వారు ఇక్కడ నివాసం ఉండటానికి వీల్లేదంటూ ఏడాదిగా నన్ను వేధిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో నేను ఇంట్లో లేని సమయం చూసి, వినాయక ప్రతిమ తిరగడానికి ఇబ్బందిగా ఉందంటూ ఏకంగా 10 మీటర్ల ప్రహరీని రాత్రికి రాత్రే కూల్చేశారు. కాలనీవాసులు సోమవారం నాకు సమాచారం ఇవ్వడంతో ఇక్కడికొచ్చా. ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదు'అని వనిత ఆవేదన వ్యక్తం చేశారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

తవణంపల్లె, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు మురుగానిపల్లె కామేశ్వరి నగర్‌కి చెందిన ఎజిల్ అరసన్(45) ఆదివారం రాత్రి కాణిపాకం నుంచి చిత్తూరు వైపు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. కాణిపాకం క్రాస్ సమీపంలోని ప్రైవేట్ కల్యాణ మండపం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అరసన్‌కు తీవ్రగాయాలవగా స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత వేలూరు సీఎంసీకి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య పూజిత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


విగ్రహాన్ని తోసిన కేసులో ఒకరిపై కేసు నమోదు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాగిమానుపెంట పంచాయతీ కోలావూరులో వినాయకుడి ఆలయంలోని విగ్రహాన్ని తోసిన కేసులో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్టీ కాలనీకి చెందిన నవీన్ మద్యం మత్తులో ఆదివారం సాయంత్రం వినాయక స్వామి ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించి విగ్రహాన్ని తోసివేశాడని గ్రామానికి చెందిన దొరస్వామి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

కోలాహలంగా గణేశుడి ప్రతిమల నిమజ్జనం



కట్టమంచి చెరువు వద్ద నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్, సిబ్బంది



అల్లియెల్లమ్మ ఆలయం వద్ద..

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను సోమవారం కట్టమంచి చెరువులో నిమజ్జనం చేశారు. కమిషనరు నరసింహప్రసాద్, ఏసీపీ నాగేంద్ర, ఎంహెచ్‌వో లోకేష్ పాల్గొన్నారు. న్యూ ప్రశాంత్ నగర్ కాలనీ పెట్టిన ప్రతిమను చిట్టి, కోడిబాబు ఆధ్వర్యంలో నిమజ్జనం చేశారు.

ఐరాల: దిగువకామినాయనపల్లెలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను సోమవారం నిమజ్జనం చేశారు. అంతకు ముందు ఊరేగించారు.

వెదురుకుప్పం: గంటావారిపల్లెలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను సోమవారం నిమజ్జనం చేశారు. అంతకు ముందు భక్తులకు అన్నదానం చేశారు.

గంగాధరనెల్లూరు: అల్లియెల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను సోమవారం రాత్రి నిమజ్జనం చేశారు. దిగువూరుకు చెందిన గ్రామస్తులు, బీసీకాలనీలోని నివాసం ఉంటున్న కుటుంబాలవారు పాల్గొన్నారు.



దిగువకామినాయునపల్లె, గంటావారిపల్లెలో వినాయక ప్రతిమల ముందు యువత సందడి